# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఎన్డీయే తరపున ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఖరారు చేశామని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ప్రకటించారు.
2. ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులతో సమావేశమవుతారు.
3. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.
3. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వి.అనిత ఆదేశించారు.
4. తెలుగు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులపై మరిన్ని చర్చలు జరగాలని కోరుకుంటున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

==========================

ఎన్డీయే తరఫున ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఖరారు చేశామని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ప్రకటించారు. ఢిల్లీలో బిజెపి పార్లమెంటరీ పార్టీ బోర్డు నిన్న సమావేశమైంది. అనంతరం జెపి నడ్డా పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 24 సెకన్లు

కాగా.. తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 21న ఎన్డీయే కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు.

మరోవైపు.. ఉపరాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఢిల్లీ వెళ్లనున్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు ఢిల్లీలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని అపరిష్కృత ప్రాజెక్టులపై సంబంధిత కేంద్రమంత్రులతో చర్చించేందుకు సమావేశం కానున్నారు. తొలుత కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌తో సమావేశమవుతారు. రాష్ట్ర ప్రాజెక్టులపై కేంద్ర రహదారులశాఖ

మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి, జలరవాణాశాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్.. విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తో సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

---------------------------

మరోవైపు అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నిన్న ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తారంగా వర్షాలు కురిశాయి. కృష్ణపట్నం, నిజాంపట్నం, మచిలీపట్నం, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టులకు 3వ నంబరు హెచ్చరికలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. బుధవారం వరకు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఒక రోజు సెలవు ప్రకటించినట్లు ఆయా జిల్లాల కలెక్టర్‌లు తెలిపారు.

---------------------------

ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంపై ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ, శాఖ మంత్రి వి.అనిత సమీక్ష నిర్వహించారు. అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పరిస్థితి తీవ్రతను బట్టి ఎక్కడికక్కడ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విపత్తు స్పందన దళాల సిబ్బంది పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. కొండ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేస్తూ.. ముందస్తు హెచ్చరికల ఆధారంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని స్పష్టం చేశారు.

మరోవైపు తెలంగాణలోనూ అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది.

---------------------------

ఉగ్ర సంస్థలతో సంబంధాలున్న నూర్ మహమ్మద్ అనే వ్యక్తిని జాతీయ దర్యాప్తు సంస్థ సహకారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉగ్ర సంబంధిత సమాచారంతో

పోలీసులు నిశితంగా పరిశీలించి అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఈ అంశంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని మంత్రి వివరిస్తూ,

వాయిస్ 20 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 29వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

నిర్మాణ రంగ అభివృద్ధికి హైదరాబాద్ అనుకూలమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని హైటెక్స్ లో నిర్వహించిన క్రెడాయ్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి  నిర్మాణ రంగ వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ..21 సెకన్లు

---------------------------

తెలుగు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులపై మరిన్ని చర్చలు జరగాలని కోరుకుంటున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొని మాట్లాడారు. ఇరు రాష్ట్రాల వాటా తేలిన తర్వాత ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలన్నారు. తెలంగాణలో ప్రాజెక్టులు పూర్తైన  తర్వాతే మిగులు జలాల అంశంపై చర్చలుంటాయని తెలిపారు.

---------------------------

గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా అయిదో విడత టోర్నీగా సింక్వెఫీల్డ్ కప్ అమెరికాలోని సెయింట్ లూయిస్ వేదికగా ఈరోజు నుంచి ప్రారంభంకానుంది. ఈ టోర్నీలో భారత చెస్ క్రీడాకారులు, దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద పాల్గొంటారు. వీరితో పాటు అమెరికా  ఫ్రాన్స్, పోలెండ్, ఉజ్బెకిస్థాన్ లకు చెందిన పలువురు  చెస్ క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొంటున్నారు. సింక్వెఫీల్డ్ కప్ పోటీలో భాగంగా  అయిదు టోర్నీల తర్వాత తొలి 4 స్థానాల్లో నిలిచే క్రీడాకారులు సావోపాలోలో జరిగే ఫైనల్ ఛాంపియన్‌షిప్‌లో పోటీ పడతారు.

=====================